# శ్రమ ఊరికే పోదు!

శ్రీనివాసరావూ, వెంకటాచారీ, ఒకే రోజు ఒకే సమయంలో అపాయింట్ అయ్యారు. ఒకే ఆఫీసులో, ఒకే కేడర్‌లో అది సింహాద్రి సిమెంటు కంపెనీ! ఇద్దరూ తెలివైన వారే అయినా, వెంకటాచారి ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూ, ప్రతిచిన్న విషయం గురించి ఎంతో శ్రద్ధవహిస్తూ జాగ్రత్తలు తీసుకుంటూ వుండేవాడు!

శ్రీనివాసరావు ఎప్పుడు చూసినా, హాయిగా కబుర్లు చెప్పుకుంటూ, ఏ బాధ్యతా తీసుకోకుండా, కిందవాళ్లేం చెబుతే అది విని కాగితాల మీద సంతకాలు పెడ్తూ వుండేవాడు. ఒక్కొక్కసారి ఏ ఫైల్లో ఏముందో కూడా తెలిసేది కాదు అతనికి!

అయితే, ప్రతీ ప్రమోషనూ ఇద్దరికీ సమానంగా వస్తూ వుండేది. ఇది చాలామందికి ఆశ్చర్యంగా ఉండేది. శ్రీనివాసరావుకి గర్వంగా ఉండేది. వెంకటాచారికి కొంచెం బాధకలిగించేది. 'పని చెయ్యని ఆ శ్రీనివాసరావుకీ, పనిలో మునిగిపోయే తనకీ; ఏ బాధ్యతా స్వీకరించని అతనికీ, బాధ్యతల్లో తలమునకలయ్యే తనకీ, ఇద్దరికీ ఏమిటీ తేడా? ఫలితం ఒకటే అయినప్పుడు, తనకి ప్రత్యేకించి ఏ గుర్తింపూ లేనప్పుడు, తనెందుకు కష్టపడి పనిచెయ్యాలి?' అని విసుక్కునేవాడు. కానీ, పని చెయ్యడం మాత్రం మానేసేవాడు కాదు. అందుకు అతని అంతరాత్మ ఒప్పుకునేది కాదు. కానీ మనసులో మాత్రం ఏ పనీ చెయ్యకుండా ఎలా అతను, తనతో సమానంగా ప్రమోషన్లు కొడుతున్నాడా అని ఆలోచిస్తూనే వుండేవాడు. వాళ్లిద్దరి కాన్ఫిడెన్షియల్ రికార్డులన్నీ పరిశీలించే అవకాశం ఒకసారొచ్చింది వెంకటాచారికి. రెండూ ఒకేలాగా వున్నాయి. 'గుడ్' 'గుడ్' అని! శ్రీనివాసరావుకి ఆశ్చర్యమూ, కోపమూ కూడా వచ్చాయి. 'ఇది ఎలా సంభవమా?' అని ఆఫీసులో అందరూ కూడా అలాగే అనుకునేవారు.

ఒకసారి ఆ కంపెనీ జనరల్ మేనేజర్‌కి ట్రాన్స్‌ఫరైంది. మీటింగులో

మాట్లాడమని శ్రీనివాసరావునీ, వెంకటాచారినీ ఇద్దరినీ కోరారు ఆఫీసువాళ్లు. వెంకటాచారి మామూలుగా జనరల్ మేనేజర్‌గారి గుణగణాలను వివరించి క్లుప్తంగా మాట్లాడి కూర్చున్నారు! శ్రీనివాసరావు దాదాపు పదిహేను నిమిషాలపాటు, అతణ్ణి అతిశయోక్తులతో ముంచెత్తేశారు. ఇంద్రుడనీ, చంద్రుడనీ, అతని వేషభాషలు అచ్చు ఇంగ్లీషు వారిలా వుంటాయనీ, అతని మనసు వెన్నకన్నా సున్నితమైనదనీ, సామర్థ్యానికీ, సంస్కారానికి మరోపేరు ఇతడేననీ, ఏదో ఏదో చెప్పుకుపోయాడు. జనం చప్పట్ల వర్షం కురిపించేరు. కొందరు హేళనగా, మరికొందరు అల్లరిగా! అదంతా తన వాగ్ధాటికే అనుకున్నాడు శ్రీనివాసరావు. ఈ పొగడ్తల స్తోత్రం వింటూవుంటే జనరల్ మేనేజర్‌గారి మొహం ఎర్రబడింది సిగ్గుతో! ఎవరు ఏమనుకున్నా శ్రీనివాసరావు మాత్రం తన పని తను చేసేసినట్టు హాయిగా ఫీలయ్యాడు.

ఆ మర్నాడు కొత్త జనరల్ మేనేజర్‌గారు వేంచేశారు. రూములో ఒక్కొక్కరినీ పరిచయం చేశారు డిప్యూటీ జి.ఎం. సోమప్పగారు. పరిచయాలు ముగియగానే 'పనుందిసార్. మళ్ళీ కలుస్తాను' అంటూ వెంకటాచారి ఒచ్చేశాడు. కానీ శ్రీనివాసరావు అక్కడే తిష్టవేసి, ఆ కబుర్లు ఈ కబుర్లూ చెబుతూ కూర్చున్నాడు. వెంకటాచారి ఒకరోజు, ఏదో అర్జంటు విషయం మాట్లాడాలని జనరల్ మేనేజర్‌గారి గదిలోకి వెళ్లాడు. అప్పటికే శ్రీనివాసరావు అక్కడ కూర్చున్నాడు.

“సార్! మీరచ్చు ఇంగ్లీషువారిలా వున్నారుసార్. మీ మనసు నవనీతం! మీ సామర్థ్యం, సంస్కారం ఎనలేనిది” అంటున్నాడు.

ఈ మాటలు ఎక్కడో విన్నట్టనిపించాయి వెంకటాచారికి. వెంటనే మెరుపులా తట్టింది అతని మనసులో 'ఇవే మాటలు అతను బదిలీ అయి వెళ్ళిపోతూన్న జనరల్ మేనేజర్ ఫేర్‌వెల్ పార్టీలో అన్నాడని' అప్పుడర్థమైంది ఇన్నేళ్లూ అతనికి కూడా తనతోపాటే వస్తున్న ప్రమోషన్లకి కారణం.

వెంకటాచారి ఆలోచనలు పూర్తి కాకుండానే, కొత్త జనరల్ మేనేజర్ గొంతు ఖంగున మోగింది! 'నువ్వెళ్లి నీ పని చేసుకోవయ్యా, నన్ను తరువాత

పొగుడుదు గాని' అంటూ. ఖంగుతిన్నాడు శ్రీనివాసరావు. అనుకోని ఈ సంఘటనకి ఆశ్చర్యం, అనుమానం రెండూ కలిగాయి!

ఆ తరువాత ఆర్నెల్లకి ప్రమోషనొచ్చింది వెంకటాచారికి! ఆ సారి శ్రీనివాసరావుకి రాలేదు. అందరూ ఆశ్చర్యపోయారు. ఆ తరువాత కొన్నాళ్ళకి తెలిసింది. "ఈ జనరల్ మేనేజరు, ఆ జనరల్ మేనేజరూ చాలా క్లోజ్' ఫ్రెండ్సనీ ఒకసారి వాళ్ల సంభాషణల్లో శ్రీనివాసరావు పొగడ్తలగురించి చెప్పుకుని నవ్వుకున్నారని.

వెంకటాచారి తృప్తిగా నిట్టూర్చాడు. శ్రీనివాసరావుకి తిట్లు తగిలాయనో, అతనికి ప్రమోషను రాలేదనో కాదు అతని సంతోషం. హార్డ్ వర్క్... బిల్... లో యస్... మే..' అని తెలుసుకున్నందుకు! పని దొంగలు ఎప్పుడో ఒకప్పుడు పట్టుబడక తప్పదని నమ్మిన సిద్ధాంతం నిజమైనందుకు, శ్రమ పడినందుకు ఫలితం ఎప్పుడూ వృథాపోదు అని మరోసారి స్వానుభవంలో రుజువైనందుకు!'

అందుకే వెంకటాచారి, తన వాళ్లనుకున్న వాళ్లందరికీ చెబుతూనే వుంటాడు కష్టపడి పనిచెయ్యమని, ఫలితం ఎప్పుడో అప్పుడు కనిపిస్తుందనీ! *